క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం పలు మండలాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. పూతలపట్టు, జీడీనెల్లూరు, గుడిపాల, పాలసముద్రం, పెనుమూరు మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

చేపల చెరువు వేలం

తవణంపల్లె: చేపల చెరువు వేలంలో రూ.80,500 ఆదాయం వచ్చిందని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. శుక్రవారం ఎగువతవణంపల్లె సచివాలయంలో చెన్నమ్మ చెరువులో చేపల పట్టుకునేందుకు వేలం నిర్వహించారు. స్థానికుడు తులసీరామ్ రూ.80,500 హెచ్చు పాట పాడి దక్కించుకున్నాడు. అనంతరం అరగొండ సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వికసిత ఆంధ్ర-2047కు ప్రణాళికల రూపకల్పన నిమిత్తం గ్రామ సభలు ముగిసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్క్ఆర్డర్లు క్లోజ్ చేయండి

- ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో 2020-2021కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వర్క్ఆర్డర్లను ఏఈలు ఈ నెలలోపు క్లోజ్ చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదేశించారు. శుక్రవారం ట్రాన్స్‌కో అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వర్క్ఆర్డర్ల పరంగా గతంలో కొందరు ఏఈలను పక్కన పెట్టిన విషయం గుర్తు చేశారు. నూతన సర్వీసులను సకాలంలో విడుదల చేయాలని, మరమ్మతులకు గురైన మీటర్లను మార్చాలన్నారు. ఇతర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్ఏఓ శ్రీనివాసులు, ఈఈలు శ్రీనివాసులు రెడ్డి, మునిచంద్ర, హరి, రవికుమార్, డీఈలు శేషాద్రి, ఆనంద్, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, ఏఏఓ, ఏఈ, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఉలవల కోసం ఆందోళన



బైరెడ్డిపల్లె: ప్రభుత్వం రాయితీతో సరఫరా చేస్తున్న ఉలవలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని లక్కనపల్లె రైతుసేవా కేంద్రం వద్ద శుక్రవారం రైతులు ఆందోళన చేశారు. రైతులు మాట్లాడుతూ, ఉలవలు సాగు చేసేందుకు అప్పులు చేసి దుక్కులు దున్నుకున్నామన్నారు. అయితే వారం రోజులుగా ఉలవలు కోసం రైతు సేవా కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పంపిణీ చేయడం నిరసించారు. వ్యవసాయశాఖ అధికారులను కలిసినా ఫలితం శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే తాము ఆందోళనబాట పట్టామని, ఇకనైనా ఉలవలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేట్ పరం సరి కాదు



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం ఎంతమాత్రమూ సరి కాదు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన వాటిని ప్రైవేట్ పరం చేయడం న్యాయమేనా? ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు తగ్గిస్తే నష్టపోయేది మేమే కదా! ప్రభుత్వ కాలేజీల్లో సీటు వస్తే బాగుంటుంది. ప్రైవేట్‌పరం చేసి పేద విద్యార్థులైన మా నుంచి అధిక ఫీజులు గుంజేందుకు చేస్తున్న కుట్రగా భావించాల్సి వస్తుంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

-యామిని, నీట్ విద్యార్థిని, చిత్తూరు



మాకు ఇక న్యాయం ఎక్కడ?



నాలాంటి పేద విద్యార్థులెందరో నీట్ పరీక్షకు కష్టపడి చదివారు. పరీక్షలు రాశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వస్తుందని ఆశతో ఉన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. ప్రైవేట్‌పరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహిస్తే మాలాంటి విద్యార్థులు ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేస్తే మెడికల్ సీట్లు మేనేజ్‌మెంట్ కోటాలో అమ్ముకునేందుకు ప్రయత్నం చేస్తారు. పేద విద్యార్థులైన మాకు న్యాయం ఎక్కడ జరుగుతుంది?

-యాశిని, నీట్ విద్యార్థిని. చిత్తూరు







నిమజ్జనానికి బయలుదేరిన వినాయకస్వామి ప్రతిమలు

కోలాహలం.. నిమజ్జనం

- డీఐరోడ్డులో ముగిసిన చవితి సంబరాలు
- కట్టమంచి చెరువులో నిమజ్జనం
- వేలంలో రూ.4లక్షలు పలికిన లడ్డు!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం డీఐ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలను శుక్రవారం అట్టహాసంగా నిమజ్జనం చేశారు. చవితిని పురస్కరించుకుని ఈ పర్యాయం ఐదు భారీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఒక్కో విగ్రహాన్ని ఒక్కో వాహనంలో ఊరేగింపుగా తరలించారు. ముఖ్యఅతిథిగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ హాజరై సారె సమర్పించారు. ఆయనకు నిర్వాహకులు కన్నన్ స్వాగతం పలికారు. ఊరేగింపులో స్వామివారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఊరేగింపులో కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల డప్పు వాయిద్య కళాకారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


ఊరేగింపు ఇలా..

డీఐ రోడ్డులో ఉదయం 11.30 గంటలకు ఊరేగింపు ప్రారంభమై బజారువీధి మీదుగా పొన్నియమ్మ గుడి వీధి, ఎం.ఎస్ఆర్ సర్కిల్, హైరోడ్డు మీదుగా కట్టమంచి వరకు కొనసాగింది. 2.30 గంటలకు కట్టమంచి చెరువులో క్రేన్ సాయంతో వినాయకులను నిమజ్జనం చేశారు. పోలీసుల శాఖ, నగర పాలక సంస్థ అధికారుల సహకారంతో నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా ముగించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.


లడ్డును దక్కించుకున్న ఎమ్మెల్యే

పోటాపోటీగా లడ్డు వేలం

పోటా పోటీగా సాగిన లడ్డు వేలంలో ఎమ్మెల్యే రూ.4 లక్షలకు దక్కించుకున్నారు.ఇదే గత ఏడాది రూ.3లక్షలకు వరకు పాటదారులు పాడారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కఠారి హేమలత తదితరులు పాల్గొన్నారు.





ఐరాలలో..

ఐరాల: మండలంలోని దిగువ కామినాయనపల్లెలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి ఏడు రోజులుగా ప్రత్యేక పూజలు చేసి శుక్రవారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. సాయంత్రం ఉత్సవ నిర్వాహకులు గణనాథుడిని ట్రాక్టర్‌పై ఉంచి, ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయండి


లేఔట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

పూతలపట్టు: లేఔట్లలోని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ధనలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని తేనేపల్లె లేఔట్లను ఆమె పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరు చేస్తారన్నారు. అలాగే, అవగాహన కల్పించి నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు.

నైపుణ్యాల పెంపుతో రాణింపు


మాట్లాడుతున్న అకడమిక్ డైరెక్టర్ శైలజ

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు నైపుణ్యాలపై పట్టు సాధించాలని విజయం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజ అన్నారు. శుక్రవారం నగర సరిహద్దులో ఉన్న విజయం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కమ్యూనికేషన్స్, సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు ప్రస్తుత సాంకేతిక యుగానికి తగ్గట్టు నైపుణ్యాలు ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటేనే పోటీ ప్రపంచంలో రాణిస్తారన్నారు. అలాగే, ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకుంటూ నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపి, అపోలో యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిరోజ్ బేగం, కో ఆర్డినేటర్లు నాన్సీ, థమీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ లలితమైన భాష

చిత్తూరు కలెక్టరేట్: హిందీ లలితమైన భాష అని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. శుక్రవారం కళాశాలలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జాతీయ భాషగా హిందీకి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 14 భాషలలో నిష్ణాతులని తెలిపారు. విశ్వనాథ సత్యనారాయణ తెలుగులో రచించిన వేయి పడగలు నవలను ఆయన హిందీలోకి సహస్ర ఫణ్ పేరుతో అద్భుతంగా అనువదించారన్నారు. హిందీ ప్రాధాన్యతను, విద్యా ఉద్యోగ అవకాశాలను హిందీ శాఖాధ్యక్షులు డాక్టర్ షమ్స్ అక్తర్ విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ ఉషారాణి మాట్లాడారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మనోహర్

16న విజయవాడ ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

పుంగనూరు: స్థానిక డిపో నుంచి విజయవాడకు ఆర్టీసీ సర్వీసు నడుపుతున్నట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ, పుంగనూరు నుంచి సోమల, సదుం, పీలేరు, తిరుపతి మీదుగా విజయవాడకు సూపర్ లగ్జరీ బస్సును ఈనెల 16 నుంచి నడుపుతామన్నారు. ఈ సర్వీసు సాయంత్రం 5 గంటలకు బయలుదేరుతుందని, దీనిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పుంగనూరు టు హైదరాబాద్ సర్వీసును రద్దు చేసినట్లు తెలిపారు.

సీతారాం ఏచూరికి నివాళి

చిత్తూరు కార్పొరేషన్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టులకు తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమూర్తి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం సీపీఐ, సీపీఎం నాయకులు వేర్వేరుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధాంతం, ఆశయాలు, కమ్యూనిస్టు వ్యవస్థ కోసం తుది శ్వాస వరకు పని చేసిన మానవతావాది అని కీర్తించారు. విద్యార్థి దశ నుంచి చివరి వరకు ఒకే పార్టీలో కొనసాగడం , మూడుసార్లు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా పనిచేయడం గొప్ప విషయం అన్నారు. దేశంలోని అన్ని పార్టీల నుంచి ఆదరణ గౌరవం పొందిన వ్యక్తి ఏచూరి అని ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజన్, సురేంద్ర, జనార్ధన్, షౌకత్, రషీద్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సమన్వయంతో సమస్యల పరిష్కారం

ఐరాల: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయ కృషి చేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతిని నివేదించారు. గుండ్లపల్లె వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు లోకేశ్వర్‌రెడ్డి సభ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. హెల్త్ సెంటర్ మరమ్మతులు చేయాలని కోరారు. గత వారం గుండ్లపల్లె వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాలయ్యాయని, సమయానికి 108 రాకపోవడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని నివేదించారు. జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలకు నాగంవాండ్లపల్లె పంచాయతీలో పనులు కల్పించాలని సర్పంచ్ శ్రీనివాసులు కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నిత్య, రోజా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల అభివృద్ధికి సహకారం

గుడిపాల: బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. శుక్రవారం బొమ్మసముద్రం జూనియర్ కళాశాల స్వర్ణోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఇక్కడ చదివిన వారెందరో దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉండటం చాలా ఆనందంగా ఉందన్నారు. కళాశాలకు బస్సు సౌకర్యం, బైపీసీ కోర్స్ ప్రారంభించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ, ఒక గొప్ప విద్యావేత్త కెఎంరెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ విద్యాలయం చాలా బాగుందని, కళాశాల ప్రాంగణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ప్రహరీ గోడ నిర్మిస్తామని, తాగునీటి వసతి కల్పన నిమిత్తం బోరు వేయిస్తామని ప్రకటించారు. విద్యను మించిన ఆస్తి లేదని, అందరూ చదువుపరంగా మంచి ఆస్తిపరులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, మాజీ ఎమ్మెల్యే గాంధీ, ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రెస్‌క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం

పూతలపట్టు: మండలకేంద్రమైన పూతలపట్టులో శుక్రవారం ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మణి, ఉపాధ్యక్షుడిగా హేమంత్‌కుమార్, కార్యదర్శిగా రమణ, ఉపకార్యదర్శిగా కిరణ్‌కుమార్, కోశాధికారిగా శేఖర్, కార్య నిర్వాహక సభ్యులుగా లక్ష్మీపతి, గురునాథ్, కుమార్, రవీంద్ర, వాసుదేవాచారిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, మురహరరెడ్డి, ఆనందయ్య, ఎంఎస్ మణి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించరూ!

- కలెక్టర్‌కు పాత్రికేయుల వినతి

చిత్తూరు కలెక్టరేట్: వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కల్పించాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌బాబు, కాశేశ్వర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం కలెక్టర్‌తోపాటు ఎస్పీ మణికంఠ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్ఓ పుల్లయ్య, ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజను మర్యాదపూర్వకంగా కలిసింది. సమస్యలు నివేదించింది. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శివప్రసాద్, పవన్‌కుమార్, కోశాధికారి అనిల్‌కుమార్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లోకనాథం, సహాయ కార్యదర్శి అశోక్ కుమార్, సభ్యులు సీపీరావు, రామకృష్ణ, బాల, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అలరించిన.. సాంస్కృతికం





కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ప్రాంతాల కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, ఇతర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అలాగే భక్తి గీతాలాపన, హరికథాకాలక్షేపం, పౌరాణిక నాటక ప్రదర్శన, కోలాటాలతో తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిని ఆలయ అధికారులు సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.









కళాకారుల నృత్యం

లంబాడీల నృత్యం, (ఇన్‌సెట్) పౌరాణిక నాటక ప్రదర్శన